# * సంస్కరణ *

నూకల నారాయణరావు

ఆమె ఒక భిక్షుక బాలిక. పేరు లక్ష్మి.

ఆమె సహచరులంతా భిక్షుకులు అనాథులూను. అందువలన లక్ష్మి అన్న పేరు లచ్చిగా వాడుకలోకివచ్చి వాళ్ళ బండనాలుకలకి అధిక్రమలేకుండా చేసింది. ఆమె నివసించేవాడపేరు 'మురికివాడ'. కనుపించేవారంతా కటిక దరిద్రులు. అందుచేతే ఆవూరి భాగ్యవంతులు ఇప్పటికికూడా అచ్చట కొంతమంది మానవత్వమున్న మనుష్యులున్నట్లు కనుగొనలేకపోయారు.

కాలం గతించినకొలదీ మురికివాడ పరిసరప్రాంతాల్లో యెన్నో వింతమార్పులు ఆచారాల రూపంగాను, అనుభవాల రూపంగాను శారీరక నైతికశక్తులద్వారా జరిగాయి. కాని మురికివాడ దాని పరిమాణాన్నిగాని, సోయగాన్నిగాని, సౌందర్యాన్నిగాని, ఉన్నతినిగాని విస్మరించి విడనాడలేదు. దానికి కారణాలు ఇవీ అని తెలుసుకోవటంకష్టం. అచ్చట నివసించే ప్రజలంతా అల్పసంతోషులు. జీవితంయొక్క విలువలు వాళ్లకి కొన్ని ప్రత్యేకాహార వస్తువులమీదనే తీవ్రంగా విజృంభిస్తూ వుంటాయి. వాళ్ళ ఉద్రేక బలహీనతతో తనువుల్ని పూర్తిగా మరిచిపోతారు.

వారిక్కావలసింది పట్టెడుఅన్నం. కాని అక్కడే వస్తుంటాయి వారిలో వారికి మన స్పర్థలు, మత్సరాలూను. దానిలో పార్టీలు ఏర్పడి కుక్కల్లా దొమ్ములాడుకుని చివరకు కొంతమంది నాశనమయ్యాక, తమ బుద్ధిహీనతను గుర్తించుకుని, పోయినవారినిగురించి వాపోతూవుంటారు. అచ్చటి హీనజంతువులు కూడా తమ ఆత్మగౌరవాన్ని విడనాడవు. అవికూడా యెన్నోసార్లు తమ హక్కుల కోసం మానవులతో హోరాహోరిగ పోరాడి ఆఖరికి ప్రాథమిక హక్కులు సంపాదించుకుని ఆరమరిక లేకుండా గర్వంగా, నిర్లక్ష్యంగా మురికివాడను పునీతంచేస్తూ సంచరిస్తుంటాయి.

వారి దైనందిన యాత్రాగమనం మునిసిపాలిటీ లైట్లలా అటు పూర్తిగా కాంతినీ, ఇటు పూర్తిగా చీకటినీ పరివ్యాప్తం చేయలేని కాంతిహీనమయిన కొనవూపిరి కార్యకలాపాలతో సాగిపోతూవుంది.

పట్టెడు మెతుకులకోసం జరిగిన ఒక సమరంలో లక్ష్మి తండ్రి గాయపడి వైద్యసహాయంలేక ఘోరంగా బాధపడుతూ మరణించాడు. ఇది సహజత్వానికి అతీతంగావున్నా ఇటువంటి నిత్యజీవిత నగ్నసత్యాన్ని మనం నమ్మితీరాలి. తండ్రిమరణంతో లక్ష్మి దిక్కులేనిపక్షయింది. దానికితగ్గట్టు ఇప్పుడామె పరిపూర్ణ యౌవనవతి. ఆమె జీర్ణవస్త్రాల్లోని అవయవ సోయగాన్ని చూసి లోకంలోని రసికమానవులు తమ అసభ్య రసికత్వంతో అంజనంవేసి ప్రయత్నాలనేవాటిని ఆలాపించకుండా వుంటారా? సౌందర్యంమీద స్వారిచేసే ఆమె మేనివస్త్రాలు రసిక మానవుల్ని రమ్మని పిలుస్తున్నాయి. కోనాలా పెట్టాలా ఆమె సౌందర్యాన్ని చూడాలంటే. పాపం! లక్ష్మి యేంచేస్తుంది? తన జీవనాధారంకోసం బయటికిరాక తప్పుతుందా? బయటికివచ్చినా ఆమెను పరీక్షగా చూడకపోవటానికి ఆమె గవర్నరుగారి ప్రియపుత్రిక కాదుగా! అనాధ సామాన్య భిక్షుకజీవి. విషపుచూపుల ప్రాబల్యంతో కుమిలిపోక ఆమెకిదారేదీ? లోకానికామె విలాసవస్తువు. ఆమె యౌవనం వాళ్ల కాటవస్తువు. కాళ్ళక్రింది భూమిలాంటి దుర్భరజీవిత మామెది.

రోజులు దొర్లిపోతున్నాయి. లచ్చి తన భిక్షుకపాత్రలో వీధివీధినా కనిపిస్తూనేవుంది. ఆమె సౌందర్యసాధనకోసం లోకం లొట్టలు వేస్తూనేవుంది. ఒకనాడు సందుమలుపులో రౌడీ రంగడు ఆమెను బలవంతంగా కౌగలించుకోబోయాడు. వీధినపోయే పెద్దమనుషులంతా యీ ఘోరాన్ని వీక్షించి ముసిముసి నగవులతో మొఖాలు చాటుచేసుకొని వెళ్ళిపోయారు. లక్ష్మి కొట్టిన చెంపదెబ్బతో రౌడీ రంగడు తన కాముక ప్రపంచంనుండి యీలోకంలో పడ్డాడు. వాడి దృష్టిలో లక్ష్మి రాకాసి అయింది. పరుగుపెట్టే లక్ష్మినిచూసి వికృతస్వరంతో "ఈరోజు దాటావ్. రేపు ఎక్కడికిపోతావే లంజా" అంటూ వెళ్ళిపోయాడు. మరి లక్ష్మి రేపు కడుపుకోసంరాక తప్పుతుందా? అప్పుడు ఈ దుర్మార్గుని తీవ్రచర్యలనుండి తన్ను తాను రక్షించుకోవటమెట్లా?

మరునాడు లక్ష్మి గుండెల్లో సమ్మెట పోటు ప్రారంభమయింది. రౌడీ రంగడంటే, వాడి పగఅంటే మాటలా! వాడి కామోద్రేకంయెదుట యీ నీతి, న్యాయం, ధర్మం, అభిమానం, గౌరవం, శాంతి అన్నీ తలవంచవలసిందే! ఐనా లోకం దుష్టునికి దోహదమిస్తుంది, కాని తనకు సానుభూతి చూపదే! లక్ష్మికి నిన్నటిప్రొద్దుటనుంచీ యింత గంజి అయినా కడుపులో పడలేదు! కడుపు దహించుకుపోతోంది. అవమాన భయాలతో అలమటించటంవల్ల లాభమేమిటి? బయలుదేరింది ఏదో నిశ్చయంతో. ఆమె మలిన విచారవదనంలో వింతకాంతి దృగ్గోచరమవుతూవుంది. ఆకాంతికి కారణం? చావుబ్రతుకుల సమస్యా పరిష్కారమే కావచ్చు.

* * *

వేణు. ఇతడొక కటిక భాగ్యవంతుడు. శిల్పాలు చెక్కడంలో అత్యద్భుత మేధావంతుడు. వయస్సు సుమారు పాతికేళ్ళుంటుంది.

కాలమహిమవల్ల అతనికిప్పుడు నా అన్నవా ళ్ళెవరూ లేరు. కాని విద్యా ధనప్రాబల్యం వల్ల అతనికి మిత్రులకొరత లేదు. అతని భాగ్యానికీ, లక్ష్మి దరిద్రానికి సంబంధం లేకపోయినా కొన్నిదృక్పథాల్లో యిరువురికీ సామరస్య సంబంధాలు యేర్పడటానికి అవ కాశముంది. ఎందుచేతనంటే యిరువురి హృదయాల్లోను మానవత్వ మింకా వుంది. కేను తను సుహృదయంతో చేసిన పవిత్ర సంస్కరణలో ఎదుటివాళ్ళ బాధాభావాలు అతని హృదయాన్ని స్పృశించేటంతటి సన్ని హితంగా కాకపోవటం అతనిలోని దుర్బల తకో తార్కాణం.



వేణు అప్పుడే కాఫీ త్రాగుతున్నాడు. బయట రోడ్డుమీదినుంచి పెద్దగోల, గల్లంతు వినిపించాయి. ఏమిటో అని బయటికివచ్చి చూశాడు. వెంటనే అదిరిపడ్డాడు. అతని కళ్ళు చింతనిప్పుల్లా ప్రజ్వరిల్లిపోతూన్నాయి. కోపంతో దహించుకుపోతున్నాడు, బయట జరిగే ప్రత్యక్ష ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని చుట్టూవున్న అభినవ కౌరవజనాన్ని చూచి. అచ్చట దుశ్శాసనుడు రౌడీ రంగడు, లక్ష్మి ద్రౌపది. అతనిలోని ప్రతి అణువూ వుద్రేకితమయిపోయింది. వేణు త్వరత్వరగా మేడదిగి గుంపులో చొరబడి రౌడీరంగన్ని కొట్టాడు. అంతా నిర్ఘాంతపోయారు దారుణాన్ని చూచి. ఒక భిక్షుకిమానాన్ని రక్షించటం ఎంత విద్రోహ కార్యమో పాపం వాళ్ళకేం తెలుసు? ఇంకాస్సేపు వ్యవధివుంటే ఆ కాస్త ఆనందం పూర్తి కావలసిందే. కాని రాక్షసుడిలావచ్చి రసభంగం చేశాడని అంతా అస్పష్టవచనాల తో మూలుక్కున్నారు. పారిపోయే వేణు స్నేహితులందరూ యీ గల్లంతు కక్కడచేరి రంగడ్ని పోలీసుస్టేషనుకి అతిథిగా అప్పగించారు. పెనుగులాటలో లక్ష్మి ముఖమంతా గీరుకుపోయి చిన్నచిన్న గాయాలుపడి రక్తం బయటికి వస్తూవుంది. ఆమె దీనంగా హృదయవిదారకంగా, అశ్రునయనాలతో వేణు వంకచూస్తూ నిలబడింది.

వేణు లక్ష్మిని లోపలికి తీసుకుపోయాడు. వేణు మురికివాడ లచ్చిని లక్ష్మిగా మార్చి రూపొందించాలనుకున్నాడు. లక్ష్మిని తన విశాలభవనంలో గులాబిపువ్వులా మృదువుగా సంస్కరిస్తూ, ఆమెలోని శక్తులు గులాబి రేఖల్లా రూపాల్ని మార్చుకుంటుంటే అనందించి ఆస్వాదించకపోవటమే అతనిఆశయం.

లక్ష్మిని సంస్కరించటంలోనే ఇప్పుడు వేణు కాలాన్ని వెళ్ళబుచ్చుతూ వున్నాడు. సంస్కరణకు అతీతంగా వున్నటువంటి సంస్కరణ లోకానికి వింతగాతోచినా ఎంత త్వరగా మర్చిపోగలిగితే అంత త్వరగా మర్చిపోవటం లోకంయొక్క పోకడకో తార్కాణం. నానాటికీ ఆమెలో అణగారివున్న సంస్కృతి, తోటిమానవుని ఉద్దీపనతో ప్రజ్వరిల్లసాగింది. ఇప్పుడు లక్ష్మి జీర్ణవస్త్రాల్లో, మురికిమేను లో కనుపించే మురికివాడ లచ్చికాదు. వేణు ఆమె భాషారూపాల్ని మార్చినట్లే పేరుని కూడా లక్ష్మికుమారిగా మార్చాడు. వేణు సన్నిహిత మిత్రుడు మోహన్‌కి తప్పించి ఈమె మురికివస్త్రాల్లో ఆకటిబాధతో అల మటించిన లచ్చి అని ఇప్పుడెవ్వరూ గుర్తించ లేరు. లోకం లచ్చినిగురించి యేనాడో మరిచిపోయింది.

సహజంగా లక్ష్మి సౌందర్యవతి. వేణు ఆమెను సంస్కరించి ఆమెను అసహ్యించుకున్న యీ లోకంచేతనే గౌరవింపచేయా లనుకున్నాడు. ఒకేవ్యక్తి బీదతనంలో వుండగా యెంత అపహాస్యంగా చూడబడుతుందో ధనవంతురాలయి ఉన్నప్పుడు అంతగొప్పగా పొగడబడుతుందని అతని నమ్మకం. నిజంగా అంతేజరిగింది. సంఘంలోనివారంతా ఇప్పుడు లక్ష్మిని గౌరవించటంతో కొంచమయినా సంకోచించటంలేదు.

పాపం లక్ష్మికి అడుగడుగునా ఆటంకాలు, అవస్థలు అవాంతరాలు ఎదుర్కొంటూ ఆమెను యేదో ఒకరూపంలో కష్టపెడుతూనే వున్నాయి. శారీరక బాధలు నిర్మూలించుకోవటంకోసం ఆనాడు లక్ష్మి అవమానాన్ని ఆశిస్తూ అయినా లోకం ముందుకు వచ్చింది. కాని అది బ్రతుకుబాధ. ఇప్పుడా జీవనోపాధిబాధ లేదు. తన నైతికశక్తులకు సంబంధించిన ఓ తీయటిబాధను విస్మరించి మరిపించటానికి ఇప్పుడామెను ఒక్క క్షణం కూడా చాతనవటంలేదు. తను వేణుని ప్రేమించింది. అతడామెను జీవంలేని ఒక సుందర ప్రతిమగా భావిస్తున్నాడు. తను

బండరాళ్ళను జీవాన్ని, సౌందర్యాన్ని, మెరుగుల్ని, మెలుకువల్ని, వెళ్లగక్కే విగ్రహాలక్రింద చెక్కినట్లే లక్ష్మినికూడా సంస్కరించి చాలా గొప్పకార్యం గావించాననుకుంటున్నాడు. కాని లక్ష్మి మానవత్వంలేని బండరాయి కాదుగా! అందుమూలాన్నే ఈ బాధ, వ్యధ, అనురాగం, ఆవేశమూను.

లక్ష్మి విచారంతో కడుపునిండినా కలతలతో కాలాన్ని కరువుగా వెళ్ళబుచ్చుతుంది. తన హృదయవేదనను ఆ రాళ్ళశిల్పికి ఏమని చెళ్ళబుచ్చుకొంటుంది? వేణు ఇవన్నీ గ్రహించడు. రూపాస్వాదనకన్న హృదయాస్వాదన తక్కువ. అతని సంస్కరణ తాలూకు ఆవేశం అతనిలో అంతర్గతమైవున్న కొన్ని సుందర, సుకుమార, సువాసనా భావాల్ని తీవ్రంగా అణచివేస్తూ వుంది. అందుచేతనే అతని నిర్ణయాల్లోని ముగింపు యెట్లావుంటుందో వూహాతీతం.

వేణుచెక్కిన శిల్పసౌందర్యాన్ని లోకం యెంతో మెచ్చుకొని మైమరచిపోతుంది. కాని అవి అతనిదృష్టిలో బండరాళ్ళే! తన హస్తనైపుణ్యంలో ఆకారాలు కూర్చుకున్న మట్టిబొమ్మలే.

మోహన్ లక్ష్మిని మొదటినుంచీ తన సోదరిగానే ప్రేమించుకుంటూ వస్తున్నాడు. మోహన్‌కి ఐదేళ్ల చిట్టిచెల్లెలు ఉండేది. ఆ పాపపేరు ప్రభ. కాని అకాలంగా వచ్చిన కలరాతో ఆమె ఐదేళ్ళ అభ్యుదయం అంతరించిపోయింది. దానితో మోహన్ దుఃఖానికి అంతులేదు. తరువాత తన చిట్టిచెల్లెలు పోలికలు, పోకడలు, నడవడికలు, అభినయాలు, అమాయకాలు గల లక్ష్మిని చూట్టంలో తనలో అంతరించిపోయిన సోదరీప్రేమ మళ్ళీ చిగురించి విజృంభింపసాగింది. దాంతో మోహానే ఆమెకు మరీ దగ్గరవాడైపోయాడు. లక్ష్మిని సంస్కరించటంలో మోహన్‌కూడా చాలా శ్రమపడ్డాడు. ఆనాటినుంచీ లక్ష్మి అంటే ఎనలేని వాత్సల్యం. ఆమెవిచారాన్ని అతడెన్నడూ సహించలేడు. ఆమె కళావిహీనమైన మోముచూస్తే అతనిగుండె బరువెక్కుతుంది. లక్ష్మికూడ మోహన్‌ని సోదరునికంటే అధికంగా ప్రేమిస్తూ, ఆదరంగా అతనిదగ్గర అరమరికలేకుండా చనువుగా, వాత్సల్యంగా సంచరిస్తూవస్తూంది.

సాయంకాలమైంది. కారుమేఘాలు ఆకాశంనిండా బరువుగా సంచరిస్తున్నాయి. కాస్సేపటికి ప్రళయం సంభవించేట్టుంది. బరువైన చినుకులశబ్దాలు ఆగిఆగివినవస్తున్నాయ్. చల్లనిగాలి నెమ్మదిగా వీస్తూవుంది. కొంచెం కొంచెం చీకట్లు వెలుగుల్ని దూరంగా తరిమి తమ ప్రాభవాన్ని ప్రతిఫలింపజేసుకొంటున్నాయి. వేణూ ఇంతవరకూ ఇంటికి చేరుకోలేదు. లక్ష్మి అతనికోసం నిర్జనమయిన ఆ వీధివంక కళ్ళు కాయలుకాచేలా యెదురు చూస్తూవుంది. వేణు బాధ్యతలేని బద్ధకస్థుడు. ఎవరో ఒకరు వెనుకవుండి, అతనికన్నీ అమరుస్తూ, సవరిస్తూవుండాలి. ఆ బాధ్యత ఇప్పుడు లక్ష్మిమీదనే పడిందంటే లక్ష్మి ఆదరణ ఆగృహంలో అధికంగావుంది గనుక.

వర్షపు చినుకులు కొంచెం తీవ్రంగా ప్రారంభమయ్యాయి. ఇటువంటిసమయంలో యెక్కడికి పోయాడో నని లక్ష్మి పరిపరి విధాలుగా పరితపిస్తూవుంది.

జరిగిపోయిన జీవితాన్ని, జరుగుతూవున్న వర్తమానాన్ని జరగనున్న భవిష్యత్తుని వూహించుకుంటే తను ఆశించేది ఆకాశపుష్పమౌతుందేమో నని ఆమె వేదనతో శూన్యంలోనికి చూస్తూవుంది. ఆదరించినవాళ్లను ఆశించటం అపరాధం కాదుకదా అని మళ్ళీ అనుకుంది. అంతులేని ఆలోచనలతో ఆమె సతమతమై పోతూవుంది, అట్టిసమయంలో మోహన్ వచ్చాడు. ఆ సంగతి కూడా తెలియదు లక్ష్మికి. మోహన్ సోఫాలో కూర్చుంటూ "లక్ష్మి"అన్నాడు నెమ్మదిగా.

లక్ష్మి తొట్రుపాటుతో వెనుతిరిగి "ఎవరూ! అన్నాయ్ నువ్వా! ఆయన ఎక్కడికి పోయారో ఇప్పటివరకూ అంతులేదు. నీకేమయినా........"

మోహన్ లక్ష్మిని పరీక్షగా చూస్తూ "క్లబ్బునుండి వాకన్నా ముందే బయలుదేరాడే! ఇంతలో యెక్కడ ఆగిపోయాడు. ఈ వెనవళిల్పుల సంచరణ వింతగావుంటుంది. అదిసరేకాని లక్ష్మి! ఏమిటి నువ్వట్లా విచారంగా వున్నావ్?"

"ఏంలేదన్నాయ్! విచారంగావున్నానా! అబ్బే లేదు" అంది మందహాసం తెచ్చుకుంటో.

"ఏం లేకపోవట మేమిటమ్మా! నా చెల్లివి కదూ! నీ ముఖం ఈమధ్య దిగులుగా వుంటూవుంది. కారణమేమిటి? చెప్పకపోతే నామీద ఒట్టే!" అన్నాడు మోహన్ కపట కోపాన్ని అభినయిస్తూ.

లక్ష్మి ఒక్క క్షణం మౌనందాల్చి చివరికంది "ఏం చెప్పేది? నా జీవితమంతా ఇట్లా వాసనలేని పుష్పంలా సమసిపోవలిసిందేనా అన్నాయ్! నీకు తెలుసుగా! ఆయన్ని నేనెట్లా ప్రేమించానో! ఆయన కీ విషయం యెట్లా తెలుస్తుంది?" అంది లక్ష్మి సిగ్గు విచారాల సమన్వయంతో.

"గ్రహించానమ్మా! నిన్ను దిగులుపరిచే దివ్యసందేశాన్ని. నిరుత్సాహపడకు. కాలమనుకూలిస్తే అన్నీ సక్రమంగానే పరిష్కారమౌతాయి"అన్నాడు మోహన్ ఓదార్పుగా.

అంతలోనే "ఏమిట్రోయ్ పరిష్కారమంటున్నావే" అంటూ వేణు తడిసినబట్టలతో ప్రవేశించాడు.

"ఆ! ఏముంది? నీ విషయమే!"అన్నాడు నవ్వుతూ మోహన్. లక్ష్మి టవల్ తెచ్చియిచ్చింది.

వేణు తల తుడుచుకుని లోపలికిపోయి పొడిబట్టలు ధరించివచ్చాడు. లక్ష్మి కాఫీ తీసుకురావటానికి లోపలికెళ్ళింది. మోహన్ మొదలుపెట్టాడు సంభాషణ "ఒరేయ్! వేణూ! చూడు అమ్మాయి నానాటికి యెట్లా కృశించిపోతోందో! ఆమెను ఒక దరికి చేర్చరా" అన్నాడు.

"ఏంరా! అట్లా అంటున్నావ్! ఇప్పుడామె కొచ్చిన లోటేమిటి?" అన్నాడు సంశయంగా సిగరెట్టు ముట్టిస్తూ.

"ఆ! ఇంత గ్రహించావ్! నీకు బొమ్మలు చెక్కటం వచ్చుకాని వాటిలోని సౌందర్య శోభల్ని చూసి ఆనందించే జ్ఞానంలేదురా! మనిషికి అందులోను యవ్వనంలో ఉన్న వాళ్ళకి తిండీ గుడ్డా తప్ప ఇంకేమీ అవసరం లేదంటావా?"

"ఇంకేం కావాలి చెప్పు. లక్ష్మి ఇంకే మన్నా కోరుతుందా! క్షణంలో నెరవేరుస్తాను. ప్రపంచానికామె లచ్చికాదు లక్ష్మీకుమారి అని చాటతాను" అన్నాడు కొంచెం ఉద్రేకంగా.

"అదికాదురా బ్రదర్! నిన్నా ఉద్రేకమే అసలు విషయాన్ని మైమరపిస్తుంది. లక్ష్మి నిన్ను మనసారా ప్రేమిస్తూవస్తుంది. చూడు వేణూ! ఆమెను ఇంతవరకు ఎంతో ఉన్నత స్థితికి తీసుకొచ్చావ్! కాని ఇప్పుడు నువ్వామెను పరిగ్రహించకపోతే నీ శిల్పకళ, నీ విజ్ఞానం, నీ సంస్కరణ అన్ని వృథా అవుతాయి. లక్ష్మి నిన్నే భగవంతునిగా అర్చిస్తూ ఆశిస్తూ, అలమటిస్తూ, నీకోసం, నీ చిరునవ్వుకోసం వేచివుంది. ఇప్పటికైనా అర్థమయిందా నీ బొమ్మలబుర్రకి?"

"అదా సంగతి! నే నెప్పుడూ ఆ విషయాన్నే గ్రహించలేకపోయానే! ఆమెను సంస్కరించి, సంఘదుర్బలతని కళ్ళారా వీక్షిద్దామన్న అభిలాష తప్ప మరో మమకారం యేమీ లేదే!" అన్నాడు ఆలోచనల లోనికిపోతూ.

"అయితే, ఆనాడు రంగడిబారినుండి రక్షించకుండావుంటేనే బాగుండేది. ఆమె స్వేచ్ఛనంతా నాశనం చేశావ్! ఇప్పుడు బంగారుపంజరంలో బంధించి, ఆమె కోర్కెలను భగ్నపరుస్తున్నావ్! యీ పంజరం బ్రతుక్కంటే, ఆ మురికివాడలోనే ఆమె సుఖించేదేమో! నువ్వానాడు రంగడిబారి నుండి రక్షించి ఆమెను సంస్కరించటంవల్ల ఆమెకు లాభమేమిటి? నీ ఆత్మసంతృప్తి తప్ప ఆమె యవ్వనాన్ని నిస్సారంగా, నికృష్టంగా నిస్సౌఖ్యంగా గడపమని యీ నికృష్టదౌర్భాగ్యపు సంస్కరణకు పూనుకున్నావా? స్వేచ్ఛలేని సంస్కరణ, అర్థంలేని ఆవేదనా ఎందుకు? లోకంగురించి ఆలోచించేటప్పుడు ఒక్కసారి నిన్ను నువ్వు పరీక్షించుకో! లేదా ఆమెను ఈ బంగారు బందిఖానానుండి తప్పించి, మురికివాడకు ముఖ్యంగా పంపించు ఏమంటావ్?" అన్నాడు మోహన్ తీవ్రంగా.

ఈ మాటలతో వేణు హృదయంలో పరివర్తన కలుగసాగింది. జరిగిన సంఘటనలన్నీ గిర్రున గ్రామఫోనురికార్డులా అతని నయనాల ముందు గోచరించాయి. రంగడి దౌర్జన్యం, తను రక్షించటం, మురికివాడ, లక్ష్మి జీర్ణ వస్త్రాలు, దీనమయిన రక్తసిక్తముఖం, ఇవన్నీ తలంచుకునేసరికి అతనిబుర్ర వేడెక్కిపోయింది. నెమ్మదిగా అన్నాడు "వద్దు! వద్దు! నా లక్ష్మిని మళ్ళీ మురికివాడకు పంపించను. నాలోని ప్రేమభావమే ఆమె ఉన్నతికి ప్రచ్ఛన్నంగా దోహదమిచ్చిందేమో! నేనే వివాహము చేసుకుంటాను. మోహన్! నువ్వు నాకు జ్ఞానోదయాన్ని కలిగించి, నా భావాలకి చైతన్యాన్ని రగిలించావు" అంటూ వేణు చెమ్మగిల్లిన తనకళ్లను వత్తుకున్నాడు.

మోహన్ ఆనందానికి అంతులేదు. తృప్తిగా నవ్వాడు.

అంతలోనే లక్ష్మి కాఫీట్రేతో వచ్చింది. మోహన్ లక్ష్మితో "ఏం చెల్లీ! వేణు నిన్ను వివాహం చేసుకుంటాడట ఇష్టమేనా!" అన్నాడు నవ్వుతూ.

"పో! అన్నాయ్! నువ్వు మరీను" అంటూ సిగ్గుతో తలవంచుకుంది లక్ష్మి.

"ఎందుకమ్మా! అంత సిగ్గు. ఇందాకటి నుంచీ వేణు కోసం పలవరించిపోయావు కదూ! రేపే మీ వివాహం క్లబ్బులో. పెండ్లంటే మాటలుకాదు. నా చిట్టి లక్ష్మి పెళ్లికి అరేంజిమెంట్సుచేసుకోవద్దూ! వస్తాను. బయట వానజల్లుకూడా తగ్గినట్టుంది" అంటూ మోహన్ వెళ్ళిపోయాడు.

## విశ్వదాభిరామ...!

రచన: "సింహశ్రీ"

✳

కొంపలెన్నొ గూల్చి కోటీశ్వరుండయి
సత్రమొకటిగట్టి సంతసించె
యముడుఁగట్టెనచట ప్రత్యేకనరకంబు ॥వి॥

చదువుకొన్న భార్య కదురాడగాలేక
చట్లుగడుగుకొంచు మెట్లుదినుచు
ముండమోపివోలె మూలఁగూర్చుండెరా ॥వి॥

ఆరుపోరుబెట్ట కభిమానముంచిన
క్రొత్తకోడలికపుడత్తగారి
మెత్తమనసుజూచి మొత్తబుద్ధాయెరా ॥వి॥

బ్రతికియుండభక్తి భావంబుజూపక
భర్తచచ్చినపుడు పాడిపాడి
పలువురిచ్చమెచ్చ పాడెపైబడియేడ్చె ॥వి॥

వద్దుదీసియింట పాతరలోబోసి
అధికలాభమవ్వ దమ్మజూచి
వుక్కిపోయెనంచు వెక్కివెక్కేడ్చెరా ॥వి॥

పెండ్లికూతురొకతె ముండమోపికిమ్రొక్క
"వేయియేండ్లు బ్రతుకవేకుమారి
నన్నుబోలి"యనుచు తిన్నగాదీవించె ॥వి॥

